క్లుప్తంగా

కాలువ పనులు ప్రారంభం



సైడ్ కాలువ నిర్మాణానికి గుంతలు తీస్తున్న జేసీబీ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు ప్రాంతంలో నుడా నిధులతో సైడ్ కాలువ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నుడా ద్వారా తమ ప్రాంతానికి రూ.50 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో సైడ్ కాలువ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. త్వరలోనే పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

బ్రిడ్జి దెబ్బతిని.. ఇరుక్కుపోయిన లారీ



బ్రిడ్జిపై ఉన్న రంధ్రంలో కుంగిన లారీ

పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ బ్రిడ్జి సోమవారం కుంగిపోయింది. ధాన్యం లారీ బ్రిడ్జి మీదుగా వెళ్తున్న సమయంలో వెనుక చక్రాలు రంధ్రంలో కుంగింది. గత కొంతకాలంగా బ్రిడ్జి దెబ్బతిని రంధ్రాలు పడి ఉండడంతో పొదలకూరు ఏఈ దృష్టికి తీసుకు వెళ్లినట్లు గ్రామ సర్పంచ్ ఉడతా రమేష్ పేర్కొన్నారు. అయితే ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరించి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల బ్రిడ్జి పూర్తిగా కుంగిపోయి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జిపై ద్విచక్ర వాహనం మాత్రమే వెళ్లేందుకు వీలుందన్నారు. కోతల సమయంలో ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్ల లారీలు ధాన్యాన్ని తరలించుకుని వెళ్లాలంటే ఇబ్బందిగా మారినట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ



గెలుపొందిన విజేతలతో జైపూర్ మేయర్, కమిషనర్లు

కోవూరు : రాజస్తాన్‌లోని జైపూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పోటీల్లో సీనియర్ పురుషుల, మహిళల డబుల్స్ పోటీల్లో కోవూరు క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా స్మాష్ రాకెట్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, కోవూరు బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.దేవిక, ప్రధాన కార్యదర్శి సిరాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తరఫున మహిళ జట్టులో పాల్గొన్న ఎం.దేవిక, పి.విజయ, పి.సుజాత మంచి ప్రతిభ కనబరిచారన్నారు. పురుషుల విభాగంలో జి.మహేష్, పి.క్రాంతికుమార్, షేక్ కరిముల్లా, సాయిబాబా ప్రతిభ కనబరిచి నాలుగో స్థానం సాధించినట్లు తెలిపారు. సత్తాచాటిన క్రీడాకారులకు ఆదివారం జైపూర్ మేయర్, కమిషనర్లు ప్రత్యేకంగా అభినందించి కప్పుతో పాటు కాంస్య పతకాలు అందజేశారు.

నెలాఖరులోపు ఆస్తి పన్నులు చెల్లించండి

• కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ వాసులు మార్చి నెలాఖరులోపు ఆస్తి పన్నులు చెల్లించి తమకు సహకరించాలని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని పలు ఇళ్లు, దుకాణాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేయడంతో పాటు పన్నులు చెల్లించాల్సిన ఆవశ్యకతపై వారికి సోమవారం అవగాహన కల్పించారు. సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించడం వల్ల ప్రభుత్వానికి మేలు చేసిన వారమవుతామన్నారు. అలాగే గతంలో చెల్లించని ఆస్తి పన్నులను కూడా ఈ నెలాఖరుకు చెల్లిస్తే వడ్డీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తోందని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని అనన్య ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా వైద్యుడు కామాక్షయ్య ఆధ్వర్యంలో మరో ఐదు రోజు ల పాటు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్‌క్లబ్ సభ్యులు రాజేంద్రప్రసాద్, భాస్కర్, బాలనరసింహరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నష్ట నివారణ

• రైతులకు ఏడీఏ రాజ్‌కుమార్ సూచన
• గ్రామాల్లో వ్యవసాయాధికారుల విస్తృత పర్యటన



పొదలకూరు : మరుపూరులో వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వర్షాలకు తడిసిన వరిపంట విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే కొంత మేర నష్టాన్ని నివారించుకోవచ్చని ఇందుకూరుపేట డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సూచించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాపిరెడ్డిపాళెంలో ముంపునకు గురైన వరి పంటను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలకు వర్షం వల్ల కొంత మేర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. దాదాపు వంద ఎకరాల్లో వరి పంట నేలవాలిందన్నారు. ఈ పరిస్థితిల్లో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకొని పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. పొలంలో నిలిచిన నీటిని వెంటనే తొలగించి తడిచిన వరి ఓదెలకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. అనంతరం వాలిన పంటను పైకి లేపి చుట్టలుగా చుట్టుకోవాలన్నారు. ఈ విషయంలో రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించేందుకు మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీఏ శివన్నారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, శ్రీనివాస చక్రవర్తి, మండల వ్యవసాయాధికారి గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాలపై పరిశీలన

ముత్తుకూరు : అకాల వర్షాలతో ఏ మేరకు పంట నష్టాలు కలిగాయో పరిశీలించే నిమిత్తం వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ శివన్నారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ శివజ్యోతి, టెక్నికల్ ఎంఏఓ శ్రీనివాస్ చక్రవర్తి, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి, తాళ్లపూడి వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసులు తదితరులు తాళ్లపూడి, మామిడిపూడి పంచాయతీల్లో పర్యటించి, వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ, పొలాల్లో వర్షపు నీరు నిలిచివుంటే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయాలని సూచించారు. వంద లీటర్ల నీటిలో ఐదు కిలోల ఉప్పు కలిపి స్ప్రే చేసుకుంటే గింజలు మొలకలు రాకుండా, రంగు మారకుండా ఉంటాయన్నారు.



తోటపల్లిగూడూరు : పాపిరెడ్డిపాళెంలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



ముత్తుకూరు : పంటల నష్టాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నీటిని బయటకు పంపాలి

పొదలకూరు : అకాల వర్షాలకు వరి పొలాల్లో చేరిన నీటిని వెంటనే బయటకు పంపాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త జీఎల్ శివజ్యోతి సూచించారు. మండలంలోని మరుపూరు, తోడేరులో అకాల వర్షానికి నేలవాలిన వరిపంటను పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటిని బయటకు పంపిన తర్వాత లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డి.విజయకుమార్‌నాయక్ మాట్లాడుతూ మోతాదుకు మించి యూరియా చల్లిన వారి పొలాల్లో పంట నేల వాలినట్లు తెలియజేశారు. ఏఓ వాసు మాట్లాడుతూ కోతకు వచ్చిన వరిపంట అకాల వర్షానికి నేల వాలిందని, వ్యవసాయశాఖ వైపు నుంచి ఎన్యుమరేషన్ చేపట్టామని తెలిపారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే దిగుబడి విషయంలో నష్టపోరని రైతులకు సూచించారు.

అధికారుల నివేదిక

వెంకటాచలం : మండలంలో గత మూడు రోజుల పాటు కురిసిన వర్షాలతో పలు గ్రామాల్లో రైతులకు కొంత మేరకు నష్టం ఏర్పడింది. వరి కోతలు ముమ్మరంగా సాగే సమయంలో వర్షం కురవడంతో పంట నేలవాలింది. ప్రస్తుతం వర్షం ఆగినా పొలాల్లో తడి ఆరకపోవడంతో వరికోతలు చేపట్టలేకపోతున్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టాలపై నివేదిక పంపాలని ఉన్నతాధికారులు సూచించడంతో మండలంలో ఏఏ గ్రామంలో ఎంత మేరకు నష్టం జరిగిందే క్షేత్ర స్థాయి సిబ్బంది చేత విచారణ చేయిస్తున్నారు. మండల పరిధిలో సుమారు 200 ఎకరాల్లో రైతులకు కొంత మేరకు నష్టం వాటిల్లి ఉంటుందని మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి తెలిపారు.



విడవలూరులో వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



వెంకటాచలం : గొలగమూడిలో నేలవాలిన వరిపంట



కోవూరులో వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ ఇందిరావతి

సూచనలు, సలహాలు పాటించాలి

కోవూరు (విడవలూరు) : అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి నష్టపోకుండా చూసుకోవాలని విడవలూరు వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలో దెబ్బతిన్న పైరును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరి, వేరుశనగ రైతులు రెండు రోజుల పాటు వర్షం వస్తుందో.. లేదో చూసుకొని కోతలు ప్రారంభించాలన్నారు.

కోవూరులో..

ప్రస్తుత వర్షాలతో కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నేల వాలిపోయిందని, తగిన జాగ్రత్తలు పాటించాలని కోవూరు వ్యవసాయశాఖ ఏడీ సుజాత, ఏఓ ఇందిరావతి తెలిపారు. మండల కేంద్రంలో వారు పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పడిపోయిన దుబ్బలను పైకి లేపి కట్టాలన్నారు. పైరు పొట్ట దశ నుంచి గింజల దశలో ఉంటే నల్లనొక్కు తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు ప్రోపికొనజోల్ ఒక మి.లీ మందును లీటరు నీటికి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు.

కామాక్షితాయి సేవలో..



హోమ్ మంత్రిత్వ వ్యవహారాల డైరెక్టర్‌కు ప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని భారతీయ హోమ్ మంత్రిత్వ శాఖ వ్యవహారాల డైరెక్టర్ పి.బాలకిరణ్ తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. తొలుత గణపతిస్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం ఈఓ వెంకటసుబ్బయ్య శేష వస్త్రాలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఏప్రిల్ 23న గురుకులంలో ప్రవేశ పరీక్షలు

ముత్తుకూరు : ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీకి 40, బైపీసీకి 40 సీట్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

నేడు సామాజిక తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం : జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2021–22వ సంవత్సరానికి సంబంధించి బహిరంగా సామాజిక తనిఖీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహరావు సోమవారం తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి పలు శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలియజేశారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

• డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ

కొడవలూరు : 2011–16 మధ్య కాలంలో ఆధార్ కార్డు తీసుకున్న వారంతా తప్పక అప్‌డేట్ చేయించుకోవాలని డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని సూచించారు. మండలంలోని గండవరం, నార్తురాజుపాళెం, రామన్నపాళెం, ఆలూరుపాడు సచివాలయాలను సోమవారం ఆమె సందర్శించి ప్రత్యేక ఆధార్ శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ పదేళ్లకోసారి తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. 2011–16 మధ్య కాలంలో ఆధార్ తీయించుకున్న వారి వివరాలు పూర్తిగా నమోదు కాలేదన్నారు. వీటిని అప్‌డేట్ చేయించుకోకపోతే ఆధార్ చెల్లుబాటు కాదని చెప్పారు. ఆధార్ అప్‌డేట్ వల్ల వేలిముద్రలు, ముఖ గుర్తింపు, ఫోన్ నంబర్‌లు ఖచ్చితంగా ఉంటాయన్నారు. జిల్లాలో ఆరు లక్షల మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోవల్సి ఉందని చెప్పారు. వీరి కోసం ఈనెల 20, 21, 27, 28, 29వ తేదీల్లో సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ ఆవశ్యకతపై సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రతిఒక్కరూ విధిగా అప్‌డేట్ చేయించుకునేలా కృషి చేయాలని ఆదేశించారు. డీఎల్‌డీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు జాలయ్య, డి.సురేష్ కుమార్, నాగరాజు, విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది సురేష్, ప్రసన్నకుమార్, దీనమ్మ తదితరులు ఉన్నారు.

ట్యాబ్‌ల వినియోగం సంతృప్తికరం



ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడవలూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను వారు సంతృప్తికరంగా వినియోగిస్తున్నారని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె సోమవారం సందర్శించి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ట్యాబ్‌లో పాఠాలు ఏ విధంగా వీక్షిస్తున్నారు? సందేహాలను ఎలా నివృత్తి చేసుకొంటున్నారు? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వినియోగిస్తున్న తీరును ప్రయోగాత్మకంగా పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్దను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం వి.అక్కిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఎర్త్ అవర్'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, హెచ్‌ఎం

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణ కోసం ఈనెల 25వ తేదీన తలపెట్టిన 'ఎర్త్ అవర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, బ్రహ్మదేవి, ముసునూరువారిపాళెం హైస్కూళ్ల హెచ్‌ఎంలు సాయిప్రసాద్, పీవీ రమణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఈ రెండు హైస్కూళ్ల పరిధిలో విద్యార్థులచే మానవహారం, ప్రదర్శన నిర్వహించారు. ఎర్త్ అవర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎర్త్ అవర్ అంటే ప్రపంచ వ్యాపంగా నిర్వహించే వాతావరణ దినోత్సవమన్నారు. భూమిని కాపాడుకొందాం–పర్యావరణాన్ని పరిరక్షించుకొందాం అనే నినాదంతో మార్చి 25వ తేదీ రాత్రి 8–30 నుంచి 9–30 గంటల మధ్య ఇళ్లల్లో విద్యుద్దీపాలు ఆర్పివేయాలన్నారు. దీనిని విజయవంతం చేసేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

• స్పందనలో పొదుపు మహిళల వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న పొదుపు మహిళలు

పొదలకూరు : తాము వెలుగు సిబ్బంది చేతిలో మోసపోయామని, తమకు న్యాయం చేయాలని మొగళ్లూరుకు చెందిన పొదుపు సంఘాలు మహిళలు డీఆర్వో వద్ద వాపోయారు. ఈ మేరకు నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్వో నారాయణమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉంటున్న పది సంఘాల్లో సభ్యులు అప్పటి వెలుగు సిబ్బంది చేతిలో మోసపోయినట్లు పేర్కొన్నారు. 2014 సంవత్సరం నుంచి తాము రుణాలు పొందుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పీఓపీ కింద రుణాలు తీసుకుని వెలుగు సీసీ, వీఓఏల ద్వారా రుణ వాయిదాను చెల్లించేవారమన్నారు. అయితే నాలుగు మాసాలకు రసీదులు అందజేసి తర్వాత ఇవ్వలేదని, తాము వెళ్లి ప్రశ్నిస్తే రసీదులు లేవని మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారన్నారు. అయితే తీసుకున్న రుణాలు జమ కాలేదని, నగదు చెల్లించాలని ఉన్నతస్థాయి అధికారులు తమపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. తాము నగదు చెల్లించినా జమ చేయకుండా ఉద్యోగులు తమను మోసగించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

వారంలో మూడ్రోజులు రాగిజావ

జిల్లాలో..	
ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
2,590	1,83,953

• నేటి నుంచి పాఠశాలల్లో అమలు

కొడవలూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నుంచి మధ్యాహ్న భోజన పథకం(జగనన్న గోరుముద్ద)లో భాగంగా రాగి జావ ఇవ్వనున్నారు. అందుకు అవసరమైన రాగి పిండి, బెల్లం పొడి ఇప్పటికే అన్ని పాఠశాలలకు చేరింది. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు ఇప్పటికే వివిధ రకాల రుచులతో మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వం తాజాగా మరింత పోషక విలువలున్న రాగి జావను అందిస్తోంది.

పోషక విలువల పెంపే లక్ష్యం

రాగి జావలో ఐరన్, కాల్షియం విలువలు పుష్కలంగా ఉంటాయి. వీటిని విద్యార్థులకు అందించడం ద్వారా విద్యార్థుల్లో ఆ లోపాలుంటే నివారించబడతాయి. ఇప్పటికే వారంలో ఐదు రోజుల పాటు గుడ్డు ఇవ్వడంతో పాటు మూడ్రోజులు చిక్కీలు అందిస్తోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ గుడ్డు ఇస్తుండగా, చిక్కీలు మాత్రం సోమ, బుధ, శుక్రవారాల్లో అందిస్తోంది. తాజాగా రాగి జావను మంగళ, గురు, శనివారాల్లో అందిస్తుంది. ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనంతో పాటు 150 మి.లీ రాగిజావ ఇస్తారు. ఇందుకు ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి ఉపయోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



పాఠశాలలకు చేరిన రాగి పిండి, బెల్లం పొడి ప్యాకెట్‌లు

మంచి పోషకాలందుతాయి



రాగి జావ వల్ల ఐరన్, కాల్షియంతో పాటు మెగ్నీషియం, ప్రొటీన్, కార్బొహైడ్రేడ్ తదితర పోషకాలు విద్యార్థులకు పుష్కలంగా అందుతాయి. ఏ ఒక్కరూ పోషకాహార లోపం బారిన పడే అవకాశమే ఉండదు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది.

– టి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల, కొడవలూరు మండలం